అప్పు చేసి పప్పు కూడు!


పలమనేరులోని ఓ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

పలమనేరు నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. కొన్ని హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టళ్ల పరిసరాల్లో పారిశుధ్యం లోపించింది. దీనికితోడు వర్షాకాలం కావడంతో అపరిశుభ్రంగా ఉన్న హాస్టళ్ల వద్ద దుర్గంధం చిమ్ముతోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. కిటికీలకు కొట్టిన మెష్‌లు దెబ్బతినడంతో విద్యార్థులకు దోమల బెడద తప్పడం లేదు. మరో వైపు హాస్టళ్లకు మెస్ చార్జీలు 4 నెలల నుంచి ప్రభుత్వం చెల్లించకపోవడంతో వార్డెన్లు సరుకులు, వంటసామగ్రి, కూరగాయలను అప్పులకు తెచ్చి వండాల్సిన దుస్థితి కలిగింది. ఇటీవల పట్టణ సమీపంలోని హాస్టల్‌ను స్థానిక జడ్జి లిఖిత, స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సైతం అన్ని హాస్టళ్లను తనిఖీ చేసినా ఎక్కడి సమస్యలు అక్కడే తాండవిస్తున్నాయి. ఇదే విషయం సాక్షి విజిట్‌లోనూ తేటతెల్లమైంది.

- సమస్యల్లో వసతి గృహాలు
- నాలుగు నెలలుగా అందని మెస్ బిల్లులు
- పలమనేరు నియోజకవర్గంలోనే రూ.కోటి వరకు బకాయిలు
- పెచ్చులూడిపడుతున్న పైకప్పులు
- అవస్థల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

పలమనేరు: నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, గురుకుల సంక్షేమ హాస్టళ్లు 15 ఉన్నాయి. వీటిలో 2వేల మంది వరకూ విద్యార్థులున్నారు. ఈ హాస్టళ్లకు సంబంధించి కొన్ని నెలలుగా మెస్ బిల్లులు దాదాపు రూ.కోటి వరకూ పేరుకుపోయాయి. ప్రభుత్వం రూపాయి కూడా విదల్చక పోవడంతో అప్పులు చేసి వంటావార్పు చేయాల్సి వస్తోందని వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు.

కొలమాసనపల్లె హాస్టల్‌కు దారి సమస్య

గ్రామానికి దూరంగా ఉన్న ఈ హాస్టల్‌కు పిల్లలు వెళ్లాలంటే దారి లేదు. వర్షం కారణంగా దారి మొత్తం బురదమయం కావడంతో నడిచి వెళ్లేందుకు కూడా వీలుగాని పరిస్థితి నెలకొంది.

మున్సిపాలిటీలో పరిస్థితి ఇలా....

స్థానిక గుడియాత్తం రోడ్డులోని 36 ఏళ్ల నాటి బీసీ హాస్టల్‌లో ఇప్పటికే బాత్‌రూమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పలు గదుల్లో పైకప్పు కాలం చెల్లి పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు భయం నడుమ ఉండాల్సి వస్తోంది. దీని పక్కనే ఉన్న ఎస్సీ-1, ఎస్సీ-2 హాస్టళ్లలోనూ విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు. పరిసరాలు అధ్వానంగా మారాయి.

- వి.కోటలోని బాలుర హాస్టళ్లలో బాత్‌రూమ్‌లకు పది గదులకు తలుపులు కూడా లేవు. దీంతో పిల్లలు ఆరు బయటే మలమూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బాలికల హాస్టళ్లలో పారిశుధ్యం లోపించింది. హాస్టళ్ల ప్రహరీగోడ తక్కువ ఎత్తులో ఉండడంతో ఆకతాయిల బెడద తప్పడం లేదు.
- బైరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో డైనింగ్‌హాలు పైకప్పు పెచ్చులూడి కూలే స్థితికి చేరింది. దీంతో పిల్లలకు మూడు పూటలా ఆరుబయట భోజనం పెడుతున్నారు. ఇక వర్షం వస్తే వీరికి వరండాలే దిక్కు. విద్యార్థులకు రోజూ చన్నీటి స్నానమే దిక్కు.


కుప్పం: అధ్వానంగా మరుగుదొడ్లు

కుప్పం నియోజకవర్గంలో..

కుప్పం: శిథిలావస్థకు చేరినా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు కొనసాగుతుండడంతో భయం గుప్పెట్లో కాలం గడుపుతన్నారు. పట్టణంలోని మునుస్వామిపురంలో ఉన్న బాలుర బీసీ, ఎస్సీ వసతి గృహాలు అధ్వానంగా మారాయి. 1982లో నిర్మించిన భవనాలు శిథిలమవుతున్నా, అదే భవనాల్లో కొనసాగుతున్నాయి. మునుస్వామిపురంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. స్నానపు గదులకు నీటి సరఫరా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్ల తలుపులు విరిగి అధ్వానంగా మారాయి. మరుగుదొడ్లకు నీటి సరఫరా సక్రమంగా కావడం లేదు. నీటి కోసం విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. మున్సిపాలిటీ నీటితో సర్దుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రతినిధులు హాస్టళ్లలో తనిఖీ చేసినా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. నియోజకవర్గంలో సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికోసం కడా ప్రాజెక్టు రూ.15 కోట్ల ప్రతిపాదనలు పంపారు. ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సంక్షేమ శాఖ అధికారులు మౌనం వహిస్తున్నారు.


శిథిలావస్థలో దండికుప్పం హాస్టల్

పెచ్చులూడుతున్న భవనాలు

శాంతిపురం: దండికుప్పం వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం భవనాలు పెచ్చులూడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 1984లో ప్రారంభమైన ఈ హాస్టల్ భవనాల్లో ఐదు గదులు, డైనింగ్ హాల్, ఆఫీసు రూం ఉన్నాయి. సరైన నిర్వహణ లేక రెండు గదుల్లో పైకప్పు, గోడలు పెచ్చులు రాలుతుండడంతో విద్యార్థులను మిగతా గదుల్లో సర్దుబాటు చేస్తున్నారు. పదవ తరగతి విద్యార్థులకు ట్యూటర్‌ను ఏర్పాటు చేసినా ప్రభుత్వం సక్రమంగా వేతనాలు ఇవ్వక మానేశాడని విద్యార్థులు చెప్పారు. దీంతో సాయంత్రం పూట వార్డెన్ తమను చదివిస్తున్నారని విద్యార్థులు తెలిపారు.


వి.కోట ఎస్సీ బాలుర హాస్టల్‌లో విరిగిన తలుపులతో బాత్‌రూమ్, మరుగుదొడ్లు


కొలమాసనపల్లె హాస్టల్‌కు వెళ్లే దారి దుస్థితి ఇలా

క్లుప్తంగా

నేడు కార్తీక దీపోత్సవం

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో నేడు సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు హిందూ జాగరణ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, సాయంత్రం భక్తులతో కలసి కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న సభ్యులు

బైరెడ్డిపల్లి: మండలంలోని జాలారిపల్లెలో ఆదివారం వి.కోట త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు అశోక్‌బాబు, సేవాసమితి సభ్యులు రవి, గౌతమ్, కృష్ణ, ఝాన్సీ పాల్గొన్నారు.

జేబుదొంగలున్నారు జాగ్రత్త!



క్యూ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

చౌడేపల్లె: బోయకొండలో భక్తుల రద్దీతో జేబుదొంగలు ఇటీవల కాలంలో చేతివాటం ప్రదర్శిస్తూ భక్తులను నిలువునా దోచేస్తున్నారు. ఈ ఘటనలపై అప్రమత్తమైన ఆలయ ఈఓ ఏకాంబరం, సీఐ కృష్ణారెడ్డి సమన్వయంతో బోయకొండలో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిఘా ముమ్మరం చేశారు. వాటితోపాటు జేబుదొంగల ముఖచిత్రాల ఫొటోలను ముద్రించి క్యూలు, జనసంద్రమైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. భక్తులు జేబుదొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులు జాగ్రత్తగా రక్షించుకోవాలని సీఐ, ఈఓ సూచనలిచ్చారు. ఎలాంటి అనుమానం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు రేపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుతం బ్యాంకు ఖాతాలపై జరుగుతున్న సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీఐ రీజినల్ చీఫ్ మేనేజర్ భవాని తెలిపారు. పుంగనూరులోని కొత్తఇండ్లు సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఖాతాదారులు ఈ సదస్సుకు హాజరు కావాలని కోరారు.

ఆమె మృతి తీరని లోటు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న నేతలు

రొంపిచెర్ల: షాహనాజ్‌జాన్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం రొంపిచెర్లలో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ నేత అల్లాబక్స్ భార్య షాహనాజ్‌జాన్ మృతదేహానికి నివాళులర్పించారు. నివాళుర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, నేతలు మంజూర్, రాజా, గురు ఉన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పలమనేరు: పట్టణంలోని ఏపీఎన్జీఓ భవనంలో డా.అగర్వాల్ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలను ఆదివారం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. నిర్వాహకులు ఆనంద్‌బాబు, సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు, వైద్యులు పల్లవి, మణికంఠ, బాలాజి పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక లయన్స్ సేవా కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలకు 72మంది హాజరు కాగా వీరిలో 13మందిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు జయశంకర్ తెలిపారు.

పంటల బీమా చేసుకోవాలి

పుంగనూరు: ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద ప్రతి రైతుకు రెండు పంటల బీమా సౌకర్యం అందిస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో వేరుశనగ, వరి పంటలకు బీమా అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు రైతులు ఈక్రాప్, బీమా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు వరికి ప్రీమియం రూ.84, వేరుశనగకు రూ.60 చెల్లించాలన్నారు. రైతులు డిసెంబర్ 15లోపు వేరుశనగ పంటకు, వరి పంటకు డిసెంబర్ 31లోపు ఆన్‌లైన్‌లో బీమా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

అదుపుతప్పిన ఐషర్ వాహనం


కాలువలోకి దూసుకెళ్లిన ఐషర్



ఆస్పత్రిలో క్షతగాత్రులు

- నలుగురికి తీవ్రగాయాలు

చౌడేపల్లె: ఐషర్ వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చౌడేపల్లె- బోయకొండ మార్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుప్పానికి చెందిన కృష్ణ (49), కూలీలు సుబ్రమణ్యం (45), బాలరాజు(35), మహేష్(18) కలసి ఐషర్ వాహనంలో శ్రీకాళహస్తి నుంచి మదనపల్లెకు డ్రిప్ పైపులు లోడ్‌కు వెళ్తుండగా ఘటన జరిగింది. చౌడేపల్లె నుంచి బోయకొండకు వెళ్తుండగా జూనియర్ కాలేజ్ వద్ద మలుపులో ఐషర్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ఈఘటనలో ఐషర్‌లో ఉన్న నలుగురు గాయపడ్డారు. గాయపడ్డ నలుగురిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం రాజమండ్రికి చెందిన గోపాలకృష్ణ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి దర్శనానంతరం దాత కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

పుంగనూరు: చౌడేపల్లె మండలంలోని తిరుమనపల్లె వద్ద కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న స్వతంత్రయ్యను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దాడులు జరిపామన్నారు. దాడుల్లో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న స్వతంత్రయ్యను పట్టుకుని కేసు నమోదు చేసి,అరెస్ట్ చేశామన్నారు.

కళాకారులకు ఆర్థిక సాయం


కళాకారులకు ఆర్థికసాయం అందించిన పూర్వవిద్యార్థులు

బైరెడ్డిపల్లె: కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కల్పించాలని బైరెడ్డిపల్లె పూర్వ విద్యార్థులు కోరారు. బైరెడ్డిపల్లెలో పురవీధుల గుండా తిరుగుతున్న కళాకారులకు ఆదివారం పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. పొట్టకూటి కోసం కళలపై ఉన్న ప్రేమను వదులుకోలేక ఇతర పనులు చేయలేకపోతున్న కళాకారులను గుర్తించి ఆదుకోవాలన్నారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డిని అన్నమ్మయ్య జిల్లా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఎంపీపీ తల్లి చిచ్చిలి చెంగమ్మ (95) గత సోమవారం మృతిచెందారు. దీంతో రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లెలో ఉన్న మృతురాలి కుమారులు పురుషోత్తంరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కోడలు సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మను ఆయన పరామర్శించారు. తాము అండగా ఉంటామని కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి


ఉయ్యాలవాడకు నివాళులర్పిస్తున్న సభ్యులు

పుంగనూరు: పట్టణంలోని తిరుపతి రోడ్డులోగల ఉయ్యాలవాడ సర్కిల్‌లో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుంగనూరు రెడ్డి జనసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ సేవలను కొనియాడారు. ఈసందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుంగనూరు రెడ్డి జన సంక్షేమ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం


విజేత జట్లతో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గుడుపల్లె: బసప్ప క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బహుమతులు, మెమెంటోలను ఆదివారం అందించారు. గత రెండు నెలలుగా మండలంలోని సంగనపల్లెలో బసప్ప క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమాన్ని ఎనిమిది జట్లుగా క్రీడలను నిర్వహించారు. చివరి రోజు విజేతలుగా పెద్దపర్తికుంట జట్టు మొదటి బహుమతిగా రూ.15వేలు, సంగనపల్లెకు రెండవ బహుమతిగా రూ.8వేలు, బోయనపల్లె జట్టుకు మూడవ బహుమతిగా రూ.5వేలు నగదు తోపాటు మెమెంటోలను ఆయన అందజేశారు. అనంతరం మోడల్ స్కూళ్లను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. వసతి గృహాల్లో సకాలంలో భోజనం పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, రవి, సంపంగి పాల్గొన్నారు.

వేరుశనగకు దుక్కులు సిద్ధం


వేరుశనగ సాగుకు సిద్ధం చేసిన దుక్కులు

పులిచెర్ల(కల్లూరు): ఈ ఏడాది రబీలో వేరుశనగ విత్తడానికి దుక్కులు సిద్ధం చేస్తున్నారు. రబీలో బోర్ల కింద మెట్ట భూముల్లో మండలంలోని రైతులు వేరుశనగను సాగు చేస్తారు. ప్రస్తుతం రబీలో 120 హెక్టార్లలో వేరుశనగ పంట వేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. దీనితోపాటు చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు రాక పోవడంతో ప్రస్తుతం రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే మెట్ట ప్రాంతంతో నీరు లేని చోట ప్రత్యామ్నాయ పంటగా ఉలవలను సాగు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ మాసం వరకు వేరుశనగ విత్తనాలను వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

కడపనత్తం విద్యార్థుల ప్రతిభ



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు, విద్యార్థి దేవేంద్రరెడ్డితో పీడీ చిరంజీవి

బైరెడ్డిపల్లె: రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో, సాఫ్ట్‌బాల్ క్రీడలకు మండలంలోని తీర్థం, కడపనత్తం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు రత్నమ్మ, వెంకటేష్ తెలిపారు. అండర్-14 విభాగంలో తీర్థం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కావేరి, యశ్వంతి, గంగాధర్ పల్నాడులో జరుగుతున్న ఖోఖో పోటీల్లో పాల్గొన్నారన్నారు. కడపనత్తం ఉన్నత పాఠశాలలో చదువుతున్న దేవేంద్రరెడ్డి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు, గుంతకల్లులో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఏఎంసీలో పేరుకుపోయిన చెత్త!

- అపరిశుభ్రంగా మారిన మార్కెట్

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని కూరగాయల మార్కెట్‌లో చెత్తను శుభ్రం చేయకపోవడంతో కంపుకొడుతోంది. ఇంతటి అపరిశుభ్రంగా ఉంటే రైతులకు ఇబ్బందులుండవా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి మార్కెట్‌లో నిత్యం పదిలోడ్ల దాకా వ్యర్థాలు పడుతుంటాయి. గతంలో ఈ చెత్తను మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించేవారు. అయితే వారికి సకాలంలో బిల్లులు చెల్లించక వారు పారిశుధ్య పనులను ఆపేశారు. దీంతో స్థానిక మార్కెట్ కమిటీ అధికారులు టెండర్ల ద్వారా మార్కెట్‌లోని చెత్తను ఏ పూటకాపూట శుభ్రం చేసి ట్రాక్టర్ల ద్వారా చెత్తను తొలగించేలా చేశారు. ఇక్కడ చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్‌కు రూ.510గా నిర్ణయించారు. ఆమేరకు సీజన్‌లో పదిలోడ్లు, అన్‌సీజన్‌లో ఐదులోడ్లుగా ఇక్కడ చెత్త నిల్వలుంటాయి. కానీ గత కొన్నిరోజులుగా మార్కెట్‌లో చెత్తను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలోనే ఎక్కువ సెస్ వసూలు చేస్తున్న మార్కెట్‌గా పేరున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు. ఈ విషయమై స్థానిక మార్కెట్ కార్యదర్శి సంజీవకుమార్‌ను వివరణ కోరగా ఇటీవల వర్షాల కారణంగా కాంట్రాక్టర్ చెత్తను తొలగించని మాట నిజమేనన్నారు. కొన్ని చోట్ల చెత్త భూమికి అతుక్కుపోయిందని దీన్ని జేసీబీ ద్వారా తొలగించాల్సి ఉందన్నారు. వెంటనే మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.


మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం



మండల కవికి సాహిత్య పురస్కారం


రఘుపతిని సన్మానిస్తున్న కళా మిత్రమండలి సభ్యులు

వి.కోట: మండలానికి చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ రఘుపతికి ఆదివారం శ్రీమతి కరణం జ్ఞానేశ్వరి సాహిత్య స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కళా మిత్రమండలి 18వ వార్షికోత్సవ సభలో రఘుపతికి ఈ పురస్కారాన్ని శ్రీమతి కరణం విమల, ప్రముఖ కవి శివారెడ్డి, నూనే అంకమరావులచే జ్ఞాపిక, సన్మాన పత్రం, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవులు గుత్తికొండ సుబ్బారావు, పూర్ణ చందు, నల్లూరి వెంకటేశ్వరులు, అరుణ పాల్గొన్నారు. పలువురు రఘుపతిని అభినందించారు.